# చేతులు చిగురించాయి

గోదారి ఆవలిగట్టున కొండల వెనక్కి తప్పుకుంటూన్న సూర్యుడి ముఖమే కాదు, ఇవతలి గట్టున కట్టేసిన లాంచీటాపుమీద కూర్చున్న రవిబాబు ముఖంకూడా జేవురించే ఉంది. అంతేకాదు. పైన కదలకుండా ఉన్న ఆకాశం కింద కదిలిపోతూన్న గోదావరికూడా అలాగే ఉంది. అదేవిటో ఇవాళ రవిబాబుతో బాటు మొత్తం ప్రకృతి ప్రకృతి అంతా ధుమధుమ లాడుతూ ఎర్రగానే ఉంది.

పిచ్చికోపం – వెర్రి ఆవేశం. పట్టరాని ఉక్రోషం. వీటితో రవిబాబు మనస్సులో చెప్పడానికి వీల్లేనంత చిరాకూ, విసుగూను. పలకరించిన ప్రతివాడినీ చితకబాదెయ్యాలనీ, కనిపించిన ప్రతివస్తువునీ చిందర వందరగా విసిరి పారెయ్యాలనీ, "ఇందులో నా తప్పేంలేదు! లోకంలో ఉన్న మనుష్యులంతా దొంగరాస్కెల్స్!" అంటూ గొంతెత్తి గట్టిగా అరవాలనీ, కోపం కసీను.

లేకపోతే ఏవిటి? ఇందులో తన తప్పేం ఉంది?

బుద్ధిగా చదువుకున్నాడు. ఫస్ట్ క్లాస్ డిగ్రీ సంపాదించాడు. పాస్ అయిన రోజునుంచి ఈ రోజు వరకూ కనిపించిన ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తూ పెడుతున్నాడు. వ్రాతపరీక్ష ఉంటే వ్రాస్తూనూ ఉన్నాడు. ఇంటర్వ్యూ వస్తే అడిగిన ప్రశ్నల కన్నింటికీ తెలిసినంతవరకూ బుద్ధిగాను వినయంగాను సమాధానాలు చెబుతూనూ ఉన్నాడు.

మూడేళ్ళయినా ఉద్యోగం రాలేదంటే, దానికి తానేం చేస్తాడు?

నిజమే. దాదాపు ముప్పై నలభై ఇంటర్వ్యూలకి వెళ్ళివచ్చాడు. అందుకు రెండు మూడువేలదాకా ఖర్చుపెట్టాల్సి వచ్చింది. చివరికి అమ్మ చెవుల్ని ఉన్న కమ్మలకి కూడా కాళ్ళు వచ్చాయి. ఇంటిల్లపాదికి కళ్ళలో నీళ్ళువచ్చాయి. తనకే ఉద్యోగం రాలేదు. రాలేదని తనుమాత్రం బాధపడ్డంలేదూ? తెలారేసరికి ఇంటో అయిదారు

విస్తళ్ల లేవాలనీ, నాన్న తీసుకువచ్చే పౌరోహిత్యం డబ్బుల్తో ఈ యిల్లు "గడపడం కష్టం అనీ తనికిమాత్రం తెలియదూ?

"ఈ జన్మలో నువ్వు ఉద్యోగం సంపాదించలేవురా! నాకు తెలుసు. వట్టి అసమర్థుడివి" అని నాన్న తిడతాడుకాని నిజానికి తను ఏంచెయ్యగలడు?

తనచేతిలో ఉందా? ఉద్యోగం అనేది చెట్టున కాసే పండా, ఇలావెళ్ళి అలా తెంపుకు తెచ్చుకోడానికి? అందులో ఎన్ని చిక్కులు, ఎన్ని మతలబులు?

మొదట, పేరునమోదు చేయించుకోడానికే ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీ చుట్టూ ఆరునెలలు తిరగాల్సి వచ్చింది. తర్వాత ఎడ్వర్‌టైజ్‌మెంట్ పడినప్పుడల్లా తన పేరుపంపమని ఎక్సేచేంజి వాళ్ళని ప్రాధేయపడ్డం. దానికెన్నో సిఫార్సులూ, లంచాలూ, కాళ్ళు పట్టుకోడాలూను. తీరా ఇంటర్వ్యూ వస్తే అక్కడ లక్ష అడ్డంకులు. ఈ ఉద్యోగాలు ఫలానా కులాలవారికే పరిమితం అనో, ఇవి ఈ జిల్లాల వారికి మాత్రమే ప్రత్యేకంగా కేటాయించిన ఉద్యోగాలనో, తన కంటే ఎక్కువ అర్హత ఉన్నవాళ్ళు వచ్చారనో ఏదోఒకటి.

ఈ ఇబ్బందులన్నీ గడిచినా మీనాన్న రాజకీయ బాధితుడా, మిలటరీలో పనిచేస్తూ చనిపోయాడా, నువ్వు వికలాంగుడివా, నీకుపూర్వానుభవం ఉందా అంటూ సవాలక్ష ప్రశ్నలు. ఈ ప్రశ్నల్లో ఏదో ఒక ప్రశ్నవచ్చి తనని కాటువేస్తూనే ఉంది. వైకుంఠపాళీలాంటి ఈ ఉద్యోగం వేటలో ఒక్క నిచ్చెనకూడా దొరకలేదు కాని ఎప్పటికప్పుడు ఏదో ఒక పామువచ్చి కబళించివేయడమే! వోమారు మంత్రిగారి ఫోను రూపంలోవస్తే మరోమారు పై ఆఫీసరుగారి రికమెండేషన్ రూపంలో వచ్చేది. ఏ రూపంలో వస్తేనేం. కాటువేసి కబళించడానికి?

కాళ్ళు అరిగీ వోర్పుతరిగీ నమ్మకం నశించే సరికి బేలతనం వచ్చేసింది తనలో. అందుకే మొన్న జరిగిన ఇంటర్వ్యూలో ఆఫీసర్ల ఎదుట ఆపుకోలేక సభ్యతా సంస్కారం మరిచి ఏడ్చేశాడు. ఈ ఉద్యోగం రాకపోతే నాకింక మరణమే శరణ్యం సార్. నన్నూ మా కుటుంబాన్నీ ఆకలిమంటల నుంచి కాపాడండి సార్ – అంటూ. వాళ్ళుమాత్రం ఏంచేస్తారు. సానుభూతి కన్పరిచారు. అనునయించారు. నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చేసరికి ఇంట్లో మామూలే – నాన్నచివాట్లూ, అమ్మ నిట్టూర్పులూ, తమ్ముళ్ళూ, చెల్లాయిలూ ఈసడింపుగా చూడ్డం. ఛీ ....... ఎందుకొచ్చిన బతుకు. ఏ రైలుకిందో తలపెట్టేద్దాం అనిపించింది.

కాని ధైర్యంచాలలేదు. తెగించలేకపోతున్నాడు. ఈ మూడురోజుల నుంచీ

ఒడ్డున ఉన్న మ్రోడుకి కట్టేసిన ఈ లాంచీలాగే ముందుకో వెనక్కో వెళ్లలేదు. అలాగని స్థిమితంగా ఉండనూలేదు. ఉండుండి తాకుతూన్న ఆలోచనా కెరటాలకి అటూ ఇటూ ఉగుతూ అస్థిమితంగా గుంజాటన పడుతోంది మనసు. కెరటంతాలూకు నీళ్ళువచ్చి లాంచీప్రక్కల్ని తాకుతూ 'తప్ ... తప్' మని చేస్తూన్న శబ్దం తన గుండెచప్పుడుకి ప్రతిధ్వనిగా వినిపిస్తోంది ... లాంచీని ఒడ్డున ఉన్న ఎండిన చెట్టుతో బంధించిన తాడు కాసేపు బిగుసుకుంటూ, కాస్సేపు వదులవుతూ కిర్రు–ర్–ర్ ... మని శబ్దం చేస్తోంది. తన శరీరానికీ ప్రాణానికీ ఉన్న బంధంకూడా అలాగే మూలుగుతోంది. ఈ లాంచీమీంచి గోదావరిలోకి ఒక్కమారుగా దూకేస్తే? ...

అస్తమిస్తూన్న సూర్యుడేకాదు, అతని కాంతిలో తడిసిన సర్వప్రకృతీ, పైన ఆకాశమూ కింద నీళ్ళతోసహా, అంతా తనకేసి ఎర్రగా గుడ్లురిమి చూస్తున్నట్లు అనిపించింది రవిబాబుకి – పక్షులు, బారులు బారులుగా తీర్చి గూళ్లకేసి ఎగిరి వెళుతున్నాయి. గాలివాటుకి ఉబ్బెత్తుగా వంగిన తెరచాపలతో, నాలుగైదు నాటు పడవలూ నావలూ తొందరగా ఒడ్డుని చేరుకొనే ప్రయత్నంలో నీటిని ఒరుసుకుని వస్తున్నాయి.

అన్నింటికీ ఒకగమ్యం, ఒకలక్ష్యం అంటూ ఉంది.

తనకి ...? గమ్యంఅంటూ ఏంలేదు. పైగా – బతుకుమీద ఆశ ఎండిపోతోంది. మోడువారిన ఆ చెట్టులా ... యాదృచ్ఛికంగా అటుచూశాడు. చెట్టు కేసి చూసిన అతనిచూపు ఆమట్టున అలాగే ఆగిపోయింది ... అస్తమిస్తూన్న సూర్యుని ఎర్రని వెలుగూ, అప్పుడే ఆకాశంలోకి తొంగిచూస్తున్న నక్షత్రం తాలూకు కాంతి కిరణం, రెండూవచ్చి, ఎండిన ఆ చెట్టుచివర చిరుకొమ్మని కలుసుకుని, జిగేలు మన్నాయి. కళ్ళు నులుపుకుని మళ్ళీచూశాడు రవిబాబు.

అనుమానం లేదు.

చెట్టు చిగిర్చింది!

లేతచిగుళ్ళమీద వెలుగు పడ్డంవల్లే తళుక్కుమని చెట్టుచివర వజ్రంలా మెరిసింది!

ఈ ఎండిన చెట్టులాగే తన బ్రతుకు కూడా చిగిరిస్తే?

వెంటనే విషాదంగా నవ్వుకున్నాడు. తనవెర్రి ఆలోచనకి.

'శిశిరంలో ఆకులు రాల్చడం – వసంతంలో చిగిర్చడం' అనే వెలుగునీడల అదృష్టం చెట్లకీ చేమలకీ ప్రకృతికీ ఉంది.

మనిషికి ఆ అదృష్టం లేదు.

బ్రతుకు కొడిగట్టడం మొదలెడితే చివరిదాకా కొడిగట్టి ఆరిపోవడమే! మళ్ళీ వెలగడం, చిగురించడమూనా .... ప్చ్ ...

ప్రాణం ఉన్నంతసేపూ ఆశ ఇలాగే వెనక్కి లాగుతుంది. తెగించాలి! ఆఖరి సారిగా కాంతికిరణం ఒకటి విసిరి సూర్యుడు అస్తమించాడు. అంధకారం అలుము కుంది.

రవిబాబు మనస్సులోకూడా ఆశ ఒక్కమారు వెలిగి, వెంటనే నిరాశా చీకట్లు అలుముకున్నాయి.

చుట్టూ మసకచీకట్లు!

ఆ చీకట్లో లాంచీపక్కనుంచి తాచుపాములా పరిగెడుతున్న గోదావరి!

రవిబాబు వో నిశ్చయాని కొచ్చాడు. లాంచీ టాపుమీద లేచి నిటారుగా నిలబడ్డాడు ... ప్రాణాలుగ్గబట్టాడు ... కళ్ళు మూసుకున్నాడు ... "ఆత్మహత్య పాపం అయితేకావచ్చు. కాని ఆకలి చావుకంటే మహాపాపంకాదు. అందువల్ల భగవంతుడా నన్ను క్షమించు" అని తనలో తను అనుకున్నాడు ... రెండు కాళ్లూ ఎత్తి ఒక్క మారు దూకేస్తాడు ఇంక –

"ఏయ్! ఎవరా లాంచీమీద? ఈతాడు పట్టుకో ... ఒ ... అబ్బాయ్! ... పట్టుకో ... తాడు పట్టుకో ..." కంగారుగా కేకలు వినిపించాయి ... కేకలతోపాటు ఉండలాచుట్టి విసిరిన తాడుముడి ఒకటివచ్చి కాళ్ళదగ్గిర దిబ్బుమని పడింది.

ఆలోచించడానికీ, తటపటాయించడానికీ టైములేదు. తన సంకల్పం ఏం లేకుండా, యాంత్రికంగా, తటాలున ఆ తాడుపట్టుకున్నాడు రవిబాబు. ఒడ్డు పట్టిస్తూన్న పడవ తాలూకు తాడు అది ... నీటి ఒరవడికి పడవ మరీ కిందకి పోకుండా, లాంచీవారకి తీసుకువచ్చి ఆపడంకోసం, పడవ సరంగులు చేసిన ప్రయత్నం అది.

నీటివాలుకి పోతూన్న పడవతాడేమో, మొదట రవిబాబుని లాగేసింది. బోల్తా పడిపోయాడు. అయితే, చేతిలో తాడుని వదల్లేదు. ఓచేత్తో తాడునీ, మరోచేత్తో లాంచీ టాపుమీద గొట్టాన్నీ గట్టిగా పట్టుకున్నాడు. దాటిపోబోయిన పడవ విసురు ఆగింది. ఇంతలో పడవమీద ఉన్న సరంగులు కూడా లాంచీమీదకి ఉరికి రవికి సాయంచేశారు. ఇద్దరు ముగ్గురు గట్టిగా తాడు పట్టుకోవడంతో పడవ ఆగింది. పడవలో ఉన్న మిగిలిన సరంగులు గబగబా కొడవళ్ళతో తాళ్ళుకోసేసి తెరచాప దింపేసి పడవని కదలకుండా

ఆపారు. నెమ్మదిగా లాంచీవారకి పడవని చేర్చి తాళ్ళతో లాంచీకి పడవకీ అంటదీసి కట్టేశారు. పడవలో జనం, ముందు లాంచీమీదకు దిగి, అక్కడి నుంచి ఒడ్డుమీదకి దిగడానికి వీలుగా, అద్దాల లాంతరు ఒకటి తీసుకుని, పడవకళాసీ, లాంచీ పడి చెక్కమీదకి వచ్చాడు.

వచ్చి, చిరుగుచొక్కా చింకిజుట్టుతో దీనంగా కనిపిస్తూన్న రవిబాబుని చూసి "బాబూ! నువ్వుతాడు పట్టుకోవడంవల్ల కానీ లేకపోతే పడవ, మరో ఫర్లాంగు కిందకి, రాళ్ళున్న ఆ రేవులోకి పోయి దెబ్బతినేది ... కొయ్యకేసిన తెరచాప ముళ్ళు ఎంతకీ ఉడిరాలేదు. నీ సాయం మరిచిపోలేను. ఇదిగో ఈ రూపాయి ఉంచు" అన్నాడు.

రవిబాబు ఉలిక్కిపడ్డాడు.

అరచేతిలోపడ్డ గుండ్రని రూపాయిబిళ్ళ, అద్దాల లాంతరు వెలుగులో జిగేల్ మని మెరిసింది!

కన్నార్పకుండా దానికేసి చాలాసేపు చూస్తూ ఉండిపోయాడు ... జీవితంలో తనదీ అంటూ చెప్పుకోదగ్గ మొదటి సంపాదన ఇది! తన రెక్కలకష్టం ... ఆ! అనుమానం ఏవిటి? ఇది తన కష్టార్జితం.

మనిషిచ్చిన బి.యే.డిగ్రీ తనకి పైసా సంపాదించి పెట్టలేకపోయింది ఇంతవరకూ .....

'దేవుడిచ్చిన చెయ్యి, ఒక్క నిముషం పరిశ్రమతో ఒక రూపాయి సంపాదించి అందించింది ... మెదడులో కోటి విద్యుత్తులు వెలిగాయి. ఇన్నాళ్ళూ ఈ చేతుల్ని మరిచిపోయి, ఈ చేతుల్లోని కాగితం ముక్కని నమ్ముకున్నాను. హు! ... ఇంక నాకు భయంలేదు ... ధైర్యంగా బ్రతగ్గలను ... మ్రోడులుగా ఉన్న నా చేతులిప్పుడు చిగిర్చాయి. ఇందాకటి మ్రోడులాగే నాకూ వసంతం వచ్చింది, వసంతం నాకు వచ్చింది' అని అరుచుకుంటూ ఆత్మ విశ్వాసంతో ఎత్తైన ఏటిగట్టు మీదికి పెద్దపెద్ద అంగలేసుకుంటూ పరిగెడుతూన్న రవిబాబును చూస్తూ, ఏం అర్థంకాక నిలబడ్డారు పడవలోంచి దిగుతూన్న జనం అంతా చిత్తరువులో బొమ్మల్లా.

(ఆంధ్రప్రభ దినపత్రిక - 1975)

*